

నేడు గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం దుర్గా మల్లేశ్వర స్వామి ప్రచార రథంతో గిరి ప్రదక్షిణ చేయనున్నారు. ఉదయం 6 గంటలకు మహా మండపం నుంచి ప్రారంభం కానుంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,800, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.4,600 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
గుంటూరు	6:26	4:42
నరసరావుపేట	6:28	4:39
బాపట్ల	6:26	4:42

తలుపు తట్టి.. నాడి పట్టి

- వైద్య రంగంలో విప్లవాత్మకం
- ప్రతి పేదింటికి వైద్యమే లక్ష్యం
- 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి ప్రారంభోత్సవం
- 14 రకాల వైద్య పరీక్షలు.. మందులు ఉచితం
- నేడు చిలకలూరిపేటలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



'ఈమె షేక్ తాయిమున్నీసాబి. వయసు 72. గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామం. షుగర్, గుండె సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిరాజుద్దీన్ ఆమె ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించారు. దీంతో ఆమెకు వైద్యశాలకు వెళ్లే పని తప్పింది. తక్షణమే వైద్యం అందింది. త్వరగా కోలుకున్నారు.'



పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రావులాపురం గ్రామంలో వైద్యం అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సుంకర సుజాత. మాదల గ్రామం, ముప్పాళ్ల మండలం. పల్నాడు జిల్లా. 11 ఏళ్ల క్రితం ప్రసవ సమయంలో సత్తెనపల్లిలో ఓ ప్రైవేట్ వైద్యశాలలో వైద్యం వికటించి వెన్నెముక దెబ్బతినడంతో అప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. తల్లి, తమ్ముడి భార్య వ్యయప్రయాసలు పడి వైద్యం అందించేవారు. ఫిజియోథెరపీకి తీసుకువెళ్లడం కష్టంగా ఉండటంతో మానేశారు. గత అక్టోబర్ నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా నెలలో రెండు సార్లు వైద్య బృందం ఇంటికే వచ్చి వైద్యం అందించింది. ఫిజియోథెరపీ చేస్తున్నారు. ప్రస్తుతం కొంత మాట్లాడే ప్రయత్నం చేస్తోంది. వైద్యులు ఇంటికి రాగానే వచ్చి రాని మాటలతో నా కోసం వచ్చారా అంటూ నవ్వుతూ... కంట నీరు పెట్టి ఆనందంతో వైద్యుడికి స్వాగతం పలుకుతోంది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ సాక్షి నరసరావుపేట: భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం 2022 అక్టోబరు నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలులో ఉంది. దీనిని అధికారికంగా గురువారం సీఎం వై.ఎస్.జగన్ చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రారంభించనున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ అంటే..

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబంలో ఎవరికైనా జబ్బు చేస్తే వైద్యుడి వద్దకు వెళ్లడం ఆనవాయితీ. రెగ్యులర్‌గా ఒకే డాక్టర్ వద్దకు ఒక కుటుంబ సభ్యుడు చికిత్స కోసం వెళుతుండటం వలన డాక్టర్, పేషెంట్ మధ్య మంచి బంధం ఏర్పడుతుంది. రోగ నిర్ధారణ సులువవుతుంది. త్వరితగతిన చికిత్స అందించే వీలుంటుంది. ఇలాంటి అత్యాధునిక వైద్య విధానాన్ని మన జిల్లాలో అమలులోకి తీసుకొచ్చారు.

ఇంటి వద్దకే సేవలు

'ఫ్యామిలీ డాక్టర్' విధానంలో ఆరోగ్య కేంద్రానికి రాలేని, ఆపరేషన్ చేయించుకుని ఇళ్ల వద్దే ఉంటున్న వారికి ఆరోగ్య కేంద్రంలో ఉండే డాక్టర్ ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించనున్నారు. సదరు వైద్యుడితో పాటు, 104 వాహనంలో ఉన్న వైద్యుడు గ్రామానికి వెళ్లి 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు.

గుండె జబ్బు నిర్ధారణ చేసే ఈసీజీ, రక్తహీనత నిర్ధారణ కోసం చేసే హెచ్‌బీ, జ్వరాలను నిర్ధారణ చేసే డెంగీ, మలేరియా, బీపీ, షుగర్ పరీక్షలు, హెచ్ఐవీ, వైరస్‌ల నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తారు. వైద్యుడితో పాటు, 104 వాహనంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, ఆశ వర్కర్ ఉంటారు.

67 రకాల మందులు..

ఈ విధానంలో 67 రకాల మందులను రోగులకు అందజేయనున్నారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, క్యాన్సర్‌జబ్బులు లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచుతారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన వారికి సేవలందించనున్నారు. వీరితో పాటు గర్భిణులు, చిన్న పిల్లలకు సేవలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య కేంద్రాల వైద్యులు వెళ్లి ప్రత్యేకంగా అవుట్ పేషెంట్ విభాగం సేవలు అందించనున్నారు.

గుంటూరు జిల్లాలో లబ్ధి ఇలా..

ఫ్యామిలీ డాక్టర్ విధానం గత ఏడాది అక్టోబరు 22న గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 1,60,338 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో సాధారణ రోగులు 68,832 మంది, యువతులు 203 మంది, గర్భిణులు 5,844 మంది, బాలింతలు 2,959 మంది, రక్తహీనత చికిత్స పొందిన వారు 795 మంది, అధిక రక్తపోటు(బీపీ) ఉన్నవారు 43,576 మంది, మధుమేహ వ్యాధిగ్రస్తులు(షుగర్) 37,604 మంది, నోటి క్యాన్సర్ బాధితులు 133 మంది, రొమ్ము క్యాన్సర్ బాధితులు 96 మంది, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు 238 మంది, క్షయ వ్యాధిగ్రస్తులు 58 మంది ఉన్నారు.

పల్నాడు జిల్లాలో..

జిల్లా వ్యాప్తంగా 1,40,974 మంది వైద్య సేవలు పొందారు. సాధారణ రోగులు 67,956 మంది, గర్భిణులు 8,690 మంది, బాలింతలు 5,534 మంది, రక్తహీనత చికిత్స పొందిన వారు 13,041 మంది, అధిక రక్తపోటు(బీపీ) ఉన్నవారు 31,171 మంది, మధుమేహ వ్యాధిగ్రస్తులు(షుగర్) 26,597 మంది, క్యాన్సర్ బాధితులు 205 మంది, క్షయ వ్యాధిగ్రస్తులు 20 మంది ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ఎంతో ప్రతిష్టాత్మకం..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ఎంతో ప్రతిష్టాత్మకమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లోంచి ఈ విధానం పుట్టింది. విలేజ్ క్లినిక్‌లకు 104 వాహనాల ద్వారా అమలు చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలందరికీ పరీక్షలు నిర్వహిస్తాం. ఆయా పరీక్షల్లో ఫలితాల ఆధారంగా మెరుగైన వైద్యాన్ని అందించనున్నాం. సికిల్ సెల్ అనీమియాతో బాధపడే వారందరినీ గుర్తించి వారి బాధ్యత తీసుకుంటాం.

– విడదల రజిని, మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ రెండో సెషన్స్

రెండు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికై ఉద్దేశించిన జేఈఈ మెయిన్స్ రెండో సెషన్స్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు అడ్మిట్ కార్డుతో పాటు నిబంధనలతో కూడిన నియమావళిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అందజేసింది. ఆన్‌లైన్ విధానంలో జరగనున్న కంప్యూటర్ ఆధారిత టెస్టులు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు రెండో షిఫ్ట్ పద్ధతిలో జరగనున్నాయి. ఈనెల 6, 8, 10, 11, 12వ తేదీల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఎన్టీఏ షెడ్యూల్ విడుదల చేసింది. కాగా గురువారం గుంటూరు రూరల్ నల్లపాడు సమీపంలోని చల్లావారిపాలెంలో ఉన్న బాలాజీ ఇన్స్పిరేషన్ టెక్నాలజీతో పాటు పేరేచర్లలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలోని అయాన్ డిజిటల్ జోన్‌లో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఒక్కో సెషన్‌కు 200 మంది చొప్పున విద్యార్థులను కేటాయించారు.

పెన్షన్ కానుక అందజేత



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక మూడో రోజు జిల్లాలో లబ్ధిదారులకు వలంటీర్లు అందజేశారు. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో బుధవారం 87.82 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,52,367 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.34 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 2,21,620 మంది లబ్ధిదారులకు రూ.61.08 కోట్లు అందజేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా పింఛన్ల పంపిణీ ఆలస్యంగా 3వ తేదీ నుంచి పంపిణీ చేయడంతో 8వ తేదీ వరకు పంపిణీ చేయనున్నారు.

న్యూస్‌రీల్

11న జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ అండర్–25 మెన్, సీనియర్స్ మెన్ విభాగాల్లో జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకలగుంట క్రికెట్ మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు సొంత కిట్‌తో రావాలని కోరారు.

జెడ్పీ స్కూళ్ల సిబ్బందికి యూనిఫాం పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న నాలుగో తరగతి సిబ్బందికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా యూనిఫాం పంపిణీ చేశారు. జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధ, జెడ్పీ సీఈఓ జె.మోహనరావు పాల్గొన్నారు.


విజయకీలాద్రిపై తిరుమంజన సేవ



తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ముల ప్రతిష్టా వార్షిక వేడుకలు బుధవారం ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు లక్ష్మీనారాయణులకు, పద్మావతి అమ్మవారికి తిరుమంజన సేవ, అలంకరణలు నిర్వహించారు. అనంతరం 12 గంటల వరకు 9 సన్నిధులలో తులసి దళాలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన చేశారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



గుంటూరు లీగల్: విద్యా, ఉపాధిలో అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం గుంటూరు బార్ అసోసియేషన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి జీబీఏ ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎక్సైజ్ కోర్టు ఏపీపీగా పని చేస్తూ జిల్లా జడ్జిగా ఎంపికైన అబ్రహంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్ పాల్గొన్నారు.



మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని గుంటూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ చుక్కా ఏసురత్నం, జేసీ రాజకుమారి, నగర డిప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు. - పాత గుంటూరు

నేడు సీఎం వైఎస్ జగన్ రాక



ఏర్పాట్లను మంత్రి విడదల రజినికి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, చిత్రంలో ఎమ్మెల్సీ తలశిల

- లింగంగుంట్లలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభోత్సవం
- సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి

చిలకలూరిపేట: సామాన్యుల ఆరోగ్యవరప్రదాయని ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. వైద్య ఆరోగ్యరంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ప్రారంభించనున్నారు. దీనికి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం వేదిక కానుంది. ముఖ్యమంత్రి రాకకోసం వారం రోజులుగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలకు అనుకూలంగా ఉండేలా చిలకలూరిపేట–నరసరావుపేట రోడ్డుకు సమీపంలోనే సభావేదిక ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సొంత నియోజకవర్గం కావడంతో ఆమె ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దీనికి తోడు ఎమ్మెల్సీ, ప్రోగ్రామ్స్ కమిటీ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్ కూడా ఏర్పాట్లతో పూర్తి స్థాయి నిమగ్నమై ఉన్నారు. వేసవి కాలం కావడంతో బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేస్తున్నారు. భోజన ఏర్పాట్లు చేశారు. అధికారులు ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను బుధవారం నిర్వహించారు.


పర్యటన ఇలా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తాడేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 9.40కు బయలుదేరి 10 గంటలకు లింగంగుంట్ల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడి లింగంగుంట్లలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్‌కు వెళ్తారు. విలేజ్ హెల్త్ సెంటర్ పరిశీలన అనంతరం 10.25కు సమీపంలోని ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ స్టాళ్లను పరిశీలించనున్నారు. తదుపరి 10.42లకు సభా ప్రాంగణానికి వస్తారు. 11 గంటల నుంచి 11.30 వరకు సభను ఉద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. 11.40కు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

అభాగ్యులపై వాత్సల్యం

పాదు చేసి.. నీరు పోసి.. ఎరువులు వేసి.. నెమ్మదిగా పురికోసపందిరి మీదకి పాకిస్తున్న ప్రేమ పంచే చేతులు దూరమైన.. అనాథలు.. అభాగ్యులు.. నిస్సహాయుల కోసం ప్రభుత్వం ముందుకొచ్చింది. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన వేలాది మంది నిరుపేదలకు ఆర్థికంగా సాయం అందించింది. ఆదరించేందుకు వాత్సల్య పథకం తీసుకొచ్చింది.

- నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న 18 ఏళ్ల లోపు చిన్నారులు అర్హులు
- నెలకు రూ.4వేలు చొప్పున సహాయం
- 10వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



నెహ్రూనగర్: అనాథలు, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. 2019 కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు కోల్పోయిన ఎంతో మంది మంది పిల్లలు అభాగ్యులుగా, అనాథలుగా మారడంతో వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు స్పాన్సర్‌షిప్‌ను ప్రవేశపెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లా బాలల రక్షణ విభాగం ద్వారా ఈ కార్యక్రమం అమలు చేయనుంది. అందులో భాగంగా లబ్ధిదారులకు నెలకు రూ.4 వేలు ఇవ్వనున్నారు.

కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికీ కేంద్ర ప్రభుత్వం రూ.2400 అందజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.1600 ఇస్తుంది. నిరుపేద నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల సంరక్షణ, ఆదరణ అవసరమైన పిల్లలు, వారి తల్లిదండ్రుల రక్త సంబంధీకులు, సంరక్షకులతో నివసిస్తూ విద్యను కొనసాగించేందుకు స్పాన్సర్‌షిప్ మంజూరు చేస్తున్నారు.

చిన్నారులకు రూ.70 లక్షలు మంజూరు

కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ప్రభుత్వం ఇటీవల కాలంలో ఆర్థిక సాయం అందించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 250 మంది చిన్నారులను గుర్తించగా వారికి ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున 7 నెలల కాలానికి గత నెలలో రూ.70 లక్షలు వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సంవత్సరం కూడా అనాథ చిన్నారులను గుర్తించి వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

అర్హులు వీరే...

- విత‌ంతువు, విడాకులు తీసుకున్న తల్లి పిల్లలు
- తల్లిదండ్రులు కోల్పోయి ఇతర కుటుంబంలో నివసిస్తున్న అనాథ పిల్లలు
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు
- పిల్లలను పెంచలేని స్థితిలో ఉన్న వారి బాలలు
- బాల న్యాయ చట్టం–2015 ప్రకారం ఆదరణ అవసరమైన చిన్నారులు
- బాల కార్మికులు, బ్యాల వివాహం, అక్రమ రవాణాకు గురైన వారు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, వికలాంగులు, తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు, యాచక పిల్లలు, వీధుల్లో నివసిస్తున్న వారి పిల్లలు, హింసకు గురైన, అనాథ ఆశ్రమాలలో బాలలు
- పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం పొందుతున్న చిన్నారులు
- కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు.

దరఖాస్తు విధానం..

- బాలుడి/బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి ఆధార్, వారి మరణ ధ్రువీకరణ పత్రం
- బాలుడి/బాలిక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బ్యాంక్ అకౌంట్ వివరాలు
- దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించాలి.

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి



మిషన్ వాత్సల్య పథకం కింద అర్హులైన చిన్నారులకు నెలకు రూ.4 చొప్పున అందిస్తుంది. ఈ నెల 10వ తేదీలోపు అంగన్‌వాడీ కేంద్రాన్ని సంప్రదించి వివరాలు తెలియజేయాలి. గతంలో ఉమ్మడి గుంటూరులో జిల్లాలో కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు 250 మందికి రూ.70లక్షలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేశాం.

– బి.మనోరంజనీ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి

గుంటూరు చానల్‌లో ఈతకు దిగి విద్యార్థి మృతి



లక్ష్మీ అభిరామ్ మృతదేహం

పెదకాకాని: గుంటూరు చానల్‌లో ఈతకు దిగిన విద్యార్థి గల్లంతు అయిన ఘటన పెదకాకాని శివారులో చోటు చేసుకుంది. వెనిగండ్ల సుందరయ్యకాలనీకి చెందిన వేల్పుల మురళీకృష్ణ, కల్యాణి దంపతులకు ఇద్దరు మగ పిల్లలు సంతానం. బాబు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నకుమారుడు లక్ష్మీ అభిరామ్ వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అభిరామ్ స్నేహితుని పుట్టినరోజుకు వెళ్లి వస్తానని తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం 8 మంది స్నేహితులు కలసి పెదకాకాని నుంచి గోళ్లమూడి వెళ్లే రోడ్డులో ఉన్న గుంటూరు చానల్ (కొత్తకాలువ)కు ఈతకు వెళ్లారు. గుంటూరు చానల్‌లో ఈత వేస్తున్న సమయంలో నీటి పరిమాణం ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ నీట మునిగారు. వారిలో ఒకరిని స్థానికులు కాలువ నుంచి బయటకు లాగారు. లక్ష్మీ అభిరామ్ (14) నీట మునిగి శ్వాస అందక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటకు కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు బాలుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

మహనీయుల విగ్రహావిష్కరణ అభినందనీయం

నవులూరులో మహాత్ముల విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కే



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: దేశం కోసం, దేశ అభివృద్ధి, పేద బడుగు బలహీనవర్గాలు, సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పాటుపడి తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల, త్యాగధనులను స్మరించుకుంటూ వారి విగ్రహాలను నగరంలో ఒకే చోట ఆవిష్కరించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) కొనియాడారు. బుధవారం నగర పరిధిలోని నవులూరు మక్కెవారితోటలో కల గాంధీ చౌక్ సెంటర్‌లో ఒకే చోట ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్, మదర్ థెరిస్సా విగ్రహాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, నగర కమిషనర్ యు.శారదాదేవితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడమే కాకుండా వారి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై వారి ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన మహాత్ముల, త్యాగధనుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం, స్మరించుకోవడం సంతోషకరమన్నారు. నగరంలో ఒకే చోట ఐదుగురు మహానుభావుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా దేశం కోసం, సమ సమాజం కోసం పోరాడిన, పాటు పడిన మహనీయుల, త్యాగధనుల విగ్రహాలను నగరమంతా గుర్తుంచుకునేలా పలు కూడళ్లలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్థానిక నాయకులు పచ్చల శ్యామ్‌బాబు, ఈపూరి ఆదామ్, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, మాజీ కౌన్సిలర్లు సంకె సునీత, కలకోటి స్వరూపరాణి, ఏపూరి సురేష్, డి.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు మహాత్మాగాంధీ చౌక్ సెంటర్ ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ లైట్లను ఎమ్మెల్యే ఆర్కే స్థానిక మహిళ చేత స్విచ్ ఆన్ చేసి ప్రారంభింపజేశారు.

ప్రయాణీకులకు మెరుగైన భద్రత

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి



స్టేషన్‌ను పరిశీలిస్తున్న చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి

రేపల్లె రూరల్: రైల్వే ప్రయాణీకులకు మెరుగైన భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రేపల్లె రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నడికుడి సెక్షన్‌లోని గుంటూరు–తెనాలి–రేపల్లె స్టేషన్‌లలో ప్రయాణీకులకు అందుతున్న భద్రతపై పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. రెండు రోజుల పాటు ఆయా స్టేషన్‌లలో భద్రత పరమైన అంశాలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక తయారు చేస్తామన్నారు. రిజర్వేషన్‌ల బోగీలలో ప్రయాణీకుల భద్రత కోసం ప్రతి బోగీకి ఒక గార్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతోపాటుగా రైల్వే ట్రాక్‌ల భద్రతను పరిశీలించి పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకుల నుంచి విన్నపాలు స్వీకరించారు. ఆయన వెంట ఏడీఆర్‌ఎం సైమన్, ఇతర అధికారులు బ్రహ్మనందరెడ్డి, రవిచంద్ర, ఎం.శ్రీనివాస్, మనోజ్‌కుమార్ గుప్త, మునిరెడ్డి, నాగయ్య, తదితరులున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

మాజీ ఉపప్రధానికి ఘనంగా నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నేతలు



మార్కెట్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యే ముస్తఫా



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి

పాత గుంటూరు: అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ నిర్మాణం కోసం జీవితాంతం పోరాడిన చైతన్య మూర్తి, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం, ఎంఆర్ఈడీసీఏపీ డైరెక్టర్ కొత్త చిన్నప్ప రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డెప్యూటీ మేయర్ సజీలలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపడానికి కృషి చేసిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని తెలిపారు. అనంతరం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సభను ప్రారంభించారు. సభలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ బాటలోనే అడుగులు వేస్తూ, వివక్ష లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవానికి నవరత్న సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. దళిత వర్గాల వారిని పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించి బ్యాంకు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం బ్యాక్ లాగ్ వేకెన్సీ ద్వారా 54 పోస్టులను ఎటువంటి సిఫార్సులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ రాజ్యంగ పరిషత్ కమిటీ సభ్యుడిగా ఉంటూ అనేక సలహాలు ఇచ్చి రాజ్యాంగంలోని నాల్గవ భాగంలో ఆదేశిక సూత్రాలు రూపొందించడంలో డా.బీఆర్ అంబేడ్కర్‌తో పాటు ముఖ్యపాత్ర పోషించారన్నారు. జేసీ జి.రాజ కుమారి మాట్లాడుతూ మహనీయుల జీవితాలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు గండి కోటేశ్వరరావు, లంబాడీ హక్కుల పోరాట కమిటీ నాయకుడు చంద్ర నాయక్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ కుమార్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిద బాబు రావు, దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రవి, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తంగిరాల యిర్మియా, డాక్టర్ అంబేడ్కర్ పీఠం అధ్యక్షుడు పప్పుల దేవదాసు, గొల్లమూడి సుందరబాబు, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, జిల్లా అధికారులు, దళిత, గిరిజన సంక్షేమ సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయపోరాట యోధుడు జగ్జీవన్ రామ్..

పట్నంబజారు: దేశంలో ఎక్కడ అణగారిన సమాజ ఉద్ధరణ ప్రస్తావన తలెత్తినా... మరెక్కడ దళిత హక్కుల మాట వినపడినా... సువర్ణాక్షరాలతో గుర్తొచ్చే మొట్టమొదటి పేరు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం బుధవారం పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయ పోరాట యోధుడైన బాబూ జగ్జీవన్ రామ్ చూపిన సంస్కరణల మార్గంలో ముందుకు సాగుతూ సామాజిక సమానత్వం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్, అణగారిన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కీర్తించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ అంటరానితనం నిర్మూలనకు తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పాల్గొన్నారు.

రక్షించే రక్త సంబంధి

వంట్లో కొంచెం రక్తం తగ్గితేనే నిస్సత్తువ ఆవరించి, నీరస పడిపోతాం. వైద్యుల సూచన మేరకు రక్తవృద్ధికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకుంటాం.. అదీ చాలకపోతే రక్తం ఎక్కించుకునేందుకు ఆపసోపాలు పడతాం. అటువంటిది ప్రతి రోజూ ఒంట్లోని మొత్తం రక్తం మార్చి, కొత్తది ఎక్కించాల్సి వస్తే.. రక్తం దొరక్కపోతే ఆ ప్రాణాలకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉంటే.. ఊహించడానికే కష్టంగా ఉన్నా ఇది నిజం.. థలసేమియా బాధితుల కష్టాలు అన్నీఇన్నీ కావు.. సరైన సమయానికి రక్తం దొరక్క.. పోయిన ప్రాణాలు ఎన్నో.. ఇటువంటి వారికి బజరంగ్ ఫౌండేషన్ అండగా నిలిచి, 'రక్త సంబంధి'యై చేయూతనిస్తుంది.



బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న దాతలు (ఫైల్)

- థలసేమియా బాధితులకు కొండంత అండ
- బాధితుల కోసం 1469 యూనిట్ల రక్తం సేకరణ
- దక్షిణ భారతదేశంలో అధిక మొత్తంలో రక్త సేకరణలో రికార్డు
- బాధితులకు అండగా బజరంగ్ ఫౌండేషన్

గుంటూరు మెడికల్: థలసేమియా ఈ వ్యాధి పేరు చెబితేనే అరికాలు మొదలు నడినెత్తి వరకు శరీరంలో వణుకు పుట్టాల్సిందే. ఎందుకంటే వ్యాధి సోకిన వారికి తరచూగా రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుంది. కొంత మందికి వారంలో ఒకసారి, కొంత మందికి రోజుకొకసారి రక్తాన్ని ఎక్కించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేం. ఒక వ్యక్తి రక్తదానం చేస్తే తప్ప ఇతరులకు రక్తాన్ని అందించే అవకాశం ఉండదు. ఎంతో మంది థలసేమియా బాధితుల సమస్యలను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టగానే బాధితులకు దేశంలోనే మొట్టమొదటిసారిగా రూ.10వేలు పెన్షన్ ప్రవేశపెట్టారు. అంతేకాకుండా ఎంతో క్లిష్టమైన శస్త్ర చికిత్సను సైతం ఉచితంగా చేయించేలా రూ.10 లక్షలు అందిస్తూ థలసేమియా బాధితుల పాలిట దేవుడయ్యారు.

సీఎంను ఆదర్శంగా ...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి థలసేమియా బాధిత చిన్నారులకు చేస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని గుంటూరుకు చెందిన బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ఒక మహత్తర కార్యానికి పూనుకున్నారు. అందులో భాగంగా 2021 డిసెంబరు 22న దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా 1469 యూనిట్ల రక్తాన్ని సేకరించి థలసేమియా చిన్నారులకు ఉచితంగా అందజేశారు. మెగా రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన మొత్తం రక్తాన్ని గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వస్తున్న బాధిత చిన్నారులకు అందజేశారు. బజరంగ్ ఫౌండేషన్ థలసేమియా బాధితుల కోసం చేసిన మెగా రక్తదానాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సీడ్స్ సొసైటీ అనే ఎన్జీఓ సంస్థ గుంటూరు నగరంలో థలసేమియా బాధితుల కోసం ప్రత్యేకంగా ఒక బ్లడ్‌బ్యాంకును ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనే థలసేమియా బాధితుల కోసం మొట్టమొదటిసారిగా గుంటూరులోనే బ్లడ్ బ్యాంకు ఏర్పాటైంది.



చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న అంబటి మురళీకృష్ణ (ఫైల్)

థలసేమియా ఫ్రీ ఏపీయే లక్ష్యం

ప్రాణాలు కాపాడే రక్తం ఏ కర్మాగారాల్లో ఉత్పత్తి కాదు. కేవలం దయార్ద్ర హృదయుల దానంతో మాత్రమే రక్తం లభిస్తుంది. ఆరోగ్యవంతమైన వ్యక్తులు విరివిరిగా రక్తదానం చేసినప్పుడే ప్రాణదానానికి సరిసమానమైన రక్తం అవసరమైన బాధితులకు అందించేందుకు వీలుకలుగుతోంది. రక్తదానం విరివిగా చేయడం ద్వారా అనారోగ్య పీడితుల ఆయురార్ధం పెరుగుతోంది. థలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధులు మానవ సమాజాన్ని పట్టి పీడిస్తుంటే, మానవతావాదులంతా సకాలంలో స్పందించాలి. విరివిగా రక్తదానం చేయడం ఒక్కటే దీనికి పరిష్కారం. కరోనాపై పోరుతో ఏవిధంగా అయితే మొత్తం సమాజం అత్యంత అప్రమత్తమై ఉమ్మడిగా కృషి చేశామో, అదే రీతిలో థలసేమియాపై కూడా పోరాటం చేయాలి. థలసేమియా రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చుదాం. పీడితుల పట్ల ప్రతిఒక్కరూ మానవత్వంతో స్పందించాల్సిన తరుణం ఇదే. తొలి ప్రయత్నంలో వీరికి రక్తనిధిని అందించి రక్షణ కవచాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. మలిదశలో ఈ వ్యాధి వ్యాప్తికి ఉన్న అవకాశాలను పసిగట్టి వ్యాపించకుండా తగిన జాగ్రత్తలపై పెద్ద ఎత్తున ప్రచారం చేసి, దీనిని నిర్మూలించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోంది.

– అంబటి మురళీకృష్ణ, బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ

ఆర్మీ మేజర్‌నంటూ మహిళలకు వల

- నకిలీ గుర్తింపు కార్డులతో మోసం
- నిందితుడి సెల్‌ఫోన్‌లో మహిళల నగ్నచిత్రాలు
- ఆర్మీ నాయక్‌ను అరెస్ట్ చేసిన దిశ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్, చిత్రంలో ముసుగులో నిందితుడు

పట్నంబజారు: ఆర్మీలో కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగం.. కానీ మేజర్‌నని చెప్పుకుంటాడు.. నకిలీ ఐడీ కార్డులు తయారు చేయిస్తాడు.. తన భార్యతో విడాకులు తీసుకున్నానని చెబుతాడు.. మహిళలకు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడతాడు.. ఆఖరికి ఒక మహిళ ధైర్యం చేసి ఫిర్యాదు చేయటంతో కటకటాల పాలయ్యాడు. దిశ పోలీసుస్టేషన్‌లో బుధవారం సీఐ డి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక మహిళకు 2016లో వివాహం జరిగింది. 2020లో బ్యాంకులో పనిచేసే భర్త ప్రమాదంలో మృతి చెందటంతో ఆమెకు ఆ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆమె గుంటూరులోని ఒక బ్యాంకులో పని చేస్తున్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట షాదీ.కామ్‌లో బిళ్లా పవన్‌కుమార్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. తాను రాజస్థాన్‌లో మేజర్‌గా పనిచేస్తున్నానని, తనది గుంటూరు అని నమ్మబలికాడు. ఇరువురి మధ్య పరిచయం ఏర్పడిన తరువాత తన బాబుకు ప్రమాదం జరిగిందని అత్యావసరంగా రూ. 50వేలు తీసుకున్నాడు. తరువాత తనకు లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి వచ్చిందని, బెంగళూరు పోస్టింగ్ ఇచ్చారని చెప్పుకొచ్చాడు. తరువాత హైదరాబాద్, గుంటూరు వచ్చిన ఆమెను కలిసి అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. దీనితో అతని ప్రవర్తన చూసిన ఆమె తనకు ఫోన్ చేయెుద్దని, చెప్పిన క్రమంలో గత నెల 31వ తేదీన తెనాలి రమ్మని పిలిచి, రాకపోతే ఇద్దరం కలిసి దిగిన ఫొటోలు, సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరింపులకు పాల్పొడ్డాడు. దీనిపై బాధితురాలు దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎంతో మంది మహిళలకు వల...

మహిళ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన దిశ పీఎస్ సీఐ నరేష్ నిందితుడిని గుర్తించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంలోని తోటవారిపాలెంకు చెందిన దక్కుమళ్ల సుదర్శనరావు అలియాస్ బిళ్లా పవన్‌కుమార్‌గా గుర్తించారు. నిందితుడు సుదర్శనరావును అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం, అతని ఫోన్‌లో సుమారు 50 మంది మహిళల ఫోన్ నెంబర్‌లు గుర్తించటంతో పాటు, వారికి ఫోన్ చేసి ఈ విషయాన్ని వెల్లడించి మోసపోవద్దని సూచించినట్లు సీఐ నరేష్ తెలిపారు. బాధిత మహిళకు సంబంధించి వాట్సాప్ వెబ్‌ను ఆమెకు తెలియకుండా యాక్సెస్ చేసి దిగిన ఫొటోలు, ఇతరత్రా వివరాలు ఆమె బంధువులకు పంపుతామని బెదిరించినట్లు గుర్తించారు. ఆర్మీలో నాయక్ హోదాలో పనిచేసే సుదర్శన్, కేవలం తన కోరికలు తీర్చుకునేందుకు, డబ్బులు కోసం మహిళలను మోసం చేస్తున్నాడని తెలిపారు. అయితే షాదీ.కామ్‌తో పాటు ఇతర యాప్‌ల ద్వారా మహిళలను పరిచయం చేసుకుని అందరినీ ఇదే విధంగా మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. 2016లో దీపిక అనే మహిళను వివాహం చేసుకున్న నిందితుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. మహిళలను నమ్మించేందుకు మేజర్ దుస్తుల్లో ఉన్న ఫొటోలను పెట్టి మోసం చేస్తాడు. కొంతమంది మహిళల నగ్న చిత్రాలు కూడా సుదర్శన్ సెల్‌ఫోన్‌లో గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, సెయింట్ జోసఫ్ ఆసుపత్రి వద్ద నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి నకిలీ, ఒరిజనల్ ఐడీ కార్డులు, రబ్బర్ స్టాంపులు, షోల్డర్ బ్యాడ్జీలు, రెండు మొబైల్‌ఫోన్‌లు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

రవాణా శాఖ ఆదాయం రూ. 231.16 కోట్లు

పట్నంబజారు: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గుంటూరు ఆర్టీఏకు రూ.231.16 కోట్ల ఆదాయం వచ్చినట్లు డీటీసీ కరీం చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 200.65 కోట్లు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం అధికంగా రూ.30.48 కోట్లు (15శాతం అధికం) ఆదాయం వచ్చినట్లు తెలిపారు. త్రైమాసిక పన్నుల రూపంలో రూ.47.49 కోట్లు, జీవిత కాలం పన్ను రూపంలో రూ. 150.56 కోట్లు, సీజ్ రూపంలో రూ. 17.24 కోట్లు, సర్వీస్ చార్జిల రూపంలో రూ. 3.86 కోట్లు, వాహనాల తనిఖీల రూపంలో రూ. 11.99 కోట్లు కలిపి, మొత్తం రూ.231.16 కోట్లు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గుంటూరు ఆర్టీఏ 131.57 శాతం సాధించి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు.

వినాయక విగ్రహం తరలింపు



సురక్షిత ప్రాంతంలో ఉంచిన విగ్రహం

ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్‌పాడు గ్రామంలో ఇటీవల గుర్తుతెలియని దుండగులు వినాయకుడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. కాగా బుధవారం దేవదాయ, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి ధ్వంసం అయిన వినాయకుడి విగ్రహాన్ని గ్రామస్తుల సహకారంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు. దేవదాయ శాఖ ఈఓ గాదె రామిరెడ్డి, ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి, సర్పంచ్ వి.వీరయ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.